ఆరోగ్యానికి పొగ
● స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల్లో మితిమీరిన కాలుష్యం
● సమీపప్రాంత వాసులకు పెరిగిన శ్వాసకోస సమస్యలు
9
రాష్ట్రంపై కేంద్రం వివక్ష
● గ్రాంట్ల చెల్లింపులో జాప్యంతో కుంటుపడుతున్న అభివృద్ధి
● యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ

కాసుకోండి..!





● పన్నుల శాఖలు పరుగులు పెట్టాలి ● ఆదాయం వచ్చే వాటిపై దృష్టిపెట్టండి
● సగం ఆర్థిక సంవత్సరం ముగిసినా పూర్తి కాని టార్గెట్ ● అధికారులకు సీఎం టాస్క్

బెంగళూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కానులు వసూలు చేయాలని.. ఖజానా నింపాలనే సీఎం సిదరామయ్య లక్ష్యంగా పెట్టుకున్నారు. ఓవైపు గ్యారెంటీ పథకాలకు అరలక్ష కోట్లకుపైగా ఏడాదికి ఖర్చు చేయాల్సి వస్తోంది. మరోవైపు అభివృద్ధికి అవసరమైనంత గ్రాంట్లు సమకూర్చుకునే పరిస్థితి లేకుండా పోతోంది. కేంద్రం నుంచి విడుదల కావాల్సిన వాటా, గ్రాంట్లలో నష్టం కలుగుతోంది. వీటన్నింటితోపాటు జీఎస్టీ స్లాబ్‌లను కేంద్రం సరళీకృతం చేయడంతో రాష్ట్రానికి భారీగా కోత పడింది. ఇలా ఆర్థికశాఖపై ఒత్తిడి పెరుగుతోంది. తాజాగా అధికార పార్టీ ఎమ్మెల్యేలతోపాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సైతం స్పెషల్ గ్రాంట్లను ప్రకటించారు. వాటిని సర్దుబాటు చేయడం సవాల్‌గా మారుతోంది. అప్పులవైపు వెళ్లేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోంది. ఇప్పటికే భారీగా చేసిన అప్పులకు వడ్డీలు భారం అవుతున్నాయి. ఇలాంటి తరుణంలోనే పన్నులు సాధ్యమయ్యే శాఖలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సీఎం సిద్దరామయ్య సన్నద్ధమయ్యారు. వాణిజ్య, ఎక్సైజ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌లతోపాటు వివిధశాఖల ముఖ్యులకు టాస్క్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. 2025-26 బడ్జెట్ ప్రకారం రెవెన్యూ ఆదాయం రూ.2.92 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో పన్నుల రూపంలోనే 2.08 లక్షల కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆర్థికసంవత్సరంలో రెండు త్రైమాసికాలు ముగిశాయి.

జీఎస్టీలో రెండు స్లాబులు

జీఎస్టీలో రెండు స్లాబులుగా విభజించి ఆటోమొబైల్‌తోపాటు 375 వస్తువుల ధరలు తగ్గించడం ద్వారా ఆశించినదానికంటే వ్యాపార వ్యవహారాలు పెరిగాయి. అయితే ఒక్కసారికి మాత్రమే ఈ ఉత్సాహం ఉంటుందని, నిరంతరంగా ఉండకపోవచ్చునని ఆర్థికశాఖ నిపుణులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. పన్నులు తగ్గాయని వాహనాలు, ఎలక్ట్రికల్, ఇతరత్రా వస్తువులు ఒక్కసారి మాత్రమే కొనుగోలు చేస్తారని అంతకుమించి నిరంతరంగా వ్యాపారాలు కొనసాగవని సూచించినట్టు తెలుస్తోంది. జీఎస్టీ మార్పులకు అనుగుణంగా సెప్టెంబరులో 7శాతం నమోదై 13,495 కోట్ల రూపాయలు పన్నులు వసూలయ్యాయి. ఇది జాతీయ సరాసరికి సమానంగా ఉంది. ఐ జీఎస్టీ సరళీకృతమయ్యాక నికరంగా 5శాతం ప్రగతి సాధించింది. జీఎస్టీ ద్వారా ప్రస్తుత బడ్జెట్‌లో 92,133 కోట్ల రూపాయలు లక్ష్యంగా ఉండేది. సెప్టెంబరు వరకు 39,132 కోట్ల దాకా వసూలు సాధ్యమైంది. జీఎస్టీ సరళీకరణ ద్వారా వ్యాపార వ్యవహారాలు కొంతమేర పెరిగాయి. సెప్టెంబరు 22నుంచి జీఎస్టీ తగ్గుముఖం పట్టింది. ఆగస్టు 15న ప్రకటించిన మేరకు దాదాపు నెలరోజులపాటు వ్యాపారాలు కొంత స్తంభించినట్టుగా అనిపించాయి. రానున్న రోజుల్లో ఆదాయం తగ్గే అవకాశం ఉంది. ఆశించినదానికంటే లోటు ఏర్పడవచ్చు. 40శాతం ప్రగతి సాధించడం కఠినమైన సవాల్ కానుంది. దీంతో ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాల్సిన అనివార్యం ఉందని అభిప్రాయపడుతున్నారు.

రూ.లక్ష కోట్లు దాటలేదు...



తద్వారా ఆర్థిక సంవత్సరంలో సగం ముగిసినట్టే. కానీ జీఎస్టీతోపాటు సొంత పన్నులు వచ్చే శాఖల నుంచి లక్ష కోట్ల రూపాయలు అధిగమించలేదు. ఇప్పుడే అప్రమత్తం కాకుంటే నాల్గో త్రైమాసికంలో ఒత్తిడి తీసుకురావడం కష్టమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. రెండు త్రైమాసికాలు ముగిసేసరికి కనీసం లక్ష కోట్లు దాటి ఉంటే చివరి రెండు త్రైమాసికాల్లో కొంత ఆశాజనకంగా భావించవచ్చు. అనుకున్న లక్ష్యం చేరడం కష్టమవుతున్న తరుణంలోనే పన్నులు వసూలు చేసే శాఖలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక శాఖ నిపుణులు సూచించారు. అందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి వివిధశాఖల ముఖ్యులతో సమావేశం నిర్వహించారు.

పన్నుల వసూళ్లలో 7-8వేల కోట్ల రూపాయలు తక్కువ వసూలయ్యే అవకాశం ఉందని ఆర్థికశాఖ భావించింది. ప్రస్తుతం జీఎస్టీ సరళీకరణతో 13-14 వేల కోట్ల రూపాయల నుంచి ఏకంగా 21వేలకోట్ల రూపాయలు ఆర్థికలోటు ఏర్పడవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జీఎస్టీ సరళీకృతం తర్వాత తగ్గుతున్న పన్నులవాటాను అక్రమాలను కట్టడి చేయడం ద్వారా కొంత పెంచుకోవాలని భావిస్తున్నారు. అబ్కారీలో లైసెన్స్‌దారులు వ్యక్తిగత సమస్యలనుంచి దీర్ఘకాలం కోసం డిమాండ్ చేస్తున్నారు. అలా కాకుండా వేలం రూపంలో 500 అబ్కారీ లైసెన్స్‌లను కేటాయించాలని తద్వారా పోటీ పడి ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సీఎం సిద్దరామయ్య శుక్రవారం వివిధశాఖల ముఖ్యులు, ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మూడో త్రైమాసికంలో టార్గెట్‌లను అధిగమించాలని ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని వివిధశాఖల అధికారులకు సీఎం సూచించారు.

పన్ను ఎగవేతదారులపై నిఘా

పన్నులను సంపూర్ణంగా వసూలు చేయాలని నిర్ణయించారు. పన్నుల ఎగవేత లేదా పన్నులు లేకుండా జరిపే వ్యాపారాల పట్ల నిరంతర నిఘా కొనసాగించాలని సీఎం సిద్దరామయ్య సూచించినట్లు సమాచారం. వ్యాపారాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలిస్తూనే స్పెషల్‌టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి బిల్లులు లేకుండా వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించినట్టు సమాచారం. గడిచిన రెండేళ్లుగా పన్నుల లీకేజ్‌ను కట్టడి చేసిన మేరకు రూ.3-5వేల కోట్ల దాకా ఆదాయం పెరిగినట్లు సీఎం తెలిపినట్లు సమాచారం. ప్రధానంగా పన్నులు చెల్లించకుండా మోసం, తక్కువపన్ను చెల్లించేవారిపై నిరంతర నిఘా, రాష్ట్రవ్యాప్తంగా వక్కతోపాటు సరుకు రవాణా వాహనాలను పరిశీలించడం, జీఎస్టీ ద్వారా వ్యాపారాలు సాగించేవారి బ్యాంకు లావాదేవీలపై నిఘా పెట్టడం, సాంకేతికంగా ఈ-వే బిల్లుల ద్వారా వ్యాపారాలను సమగ్రంగా నిఘా పెట్టడం, నిబంధనలు ఉల్లంఘించి వ్యాపార వ్యవహారాలు, భారీస్థాయిలో సరుకు రవాణా వంటి అంశాలను గుర్తించడం, పన్నుల ఎగవేత దారులకు ఎప్పటికప్పుడు నోటీసులు ఇవ్వడం, అబ్కారీ, రిజిస్ట్రేషన్, మోటారు వాహనాల పన్నుల వసూళ్లలో కొత్త విధానాలు తీసుకురావడం, వాడుకలో లేని జీఎస్టీ నెంబర్లను ఉపయోగించడం తదితర వాటిపై ఆరా తీయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.



లాల్‌బాగ్‌లో వాకర్లతో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

సొరంగ మార్గంతో లాల్‌బాగ్‌కు

ఇబ్బంది ఉండదు

● రూ.10కోట్లతో ఈ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తా
● డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హెబ్బాళ నుంచి సిల్క్‌బోర్డు దాకా ఏర్పాటు చేయనున్న సొరంగమార్గంతో లాల్‌బాగ్‌లో కేవలం 6 ఎకరాల పరిధిలో మాత్రమే నిర్మాణాలు ఉంటాయని అయితే ఉద్యానవనానికి ఎక్కడా ఆటంకం ఉండదని డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. శనివారం లాల్‌బాగ్‌లో ఉదయం వాకర్స్‌తో అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఐదు పాలికెల కమిషనర్‌లు, ఉన్నతాధికారులతో కలసి లాల్‌బాగ్ మొత్తం వాకింగ్ చేశారు. ఎక్కడికక్కడ ప్రజాభిప్రాయాలను తెలుసుకున్నారు. సమగ్ర సమాచారాన్ని ఇవ్వండి అంటూ వారి ఫోన్ నెంబర్లు తీసుకున్నారు. ఎక్కువమంది వాకర్స్ సొరంగమార్గం ద్వారా లాల్‌బాగ్‌ను ఆక్రమించే చర్యలు చేపట్టరాదని సూచించారు. ఐదు పాలికెలతో స్థానికులకు నష్టం కలిగించే చర్యలు చేపట్టరాదని సూచించారు. నగరంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల హోదాతోపాటు సౌలభ్యాలు పెంచాలని కోరారు. సుమారు 500మందికిపైగా వాకర్స్‌తో డీసీఎం అభిప్రాయాలు సేకరించారు. ఆ తర్వాత లాల్‌బాగ్ చెరువును సందర్శించారు. అనంతరం గ్లాస్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన చర్చావేదికలో పాల్గొని మాట్లాడుతూ రూ.10కోట్లతో లాల్‌బాగ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఒక అంబులెన్స్, ఒక డాక్టర్ సౌలభ్యం ఉంటుందని, వ్యాయామంకోసం ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యయనం కోసం వచ్చే విద్యార్థులకు ఫొటోగ్రఫీకి అవకాశం ఇస్తామన్నారు. ఐదు పాలికెలకు రెండేళ్లలో శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా జీబీఏ చీఫ్ కమిషనర్ మహేశ్వర్‌రావు, స్పెషల్ కమిషనర్ తుషార్ గిరినాథ్‌తోపాటు ఐదు పాలికెల కమిషనర్‌లు పాల్గొన్నారు. అనంతరం డీసీఎం మాట్లాడుతూ త్వరలోనే సీఎం అవుతానని ఎక్కడా వ్యాఖ్యానించలేదని, లాల్‌బాగ్‌లో అటువంటి ప్రస్తావన రాలేదన్నారు.

రాహుల్ గాంధీతో సీఎం మనవడు



ధవన్ షేర్ చేసిన ఫొటో

● సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ధవన్

బెంగళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కీలక నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతో సీఎం సిద్దరామయ్య మనవడు ధవన్ రాకేశ్ ఉన్న ఫొటోను సోషల్‌మీడియాలో శనివారం షేర్ చేశారు. ఇటీవల ఆగస్టు 8న రాహుల్‌గాంధీని భేటీ అయ్యే అవకాశం తనకు లభించిందన్నారు. ప్రామాణిక నేతలను నేను ఎంతగానో గౌరవిస్తానని, వారిని కలిసేందుకు ప్రయత్నిస్తానని ధవన్ పోస్ట్ చేశారు. మా తాత గుర్తించడంతోనే ఇది సాధ్యమైందన్నారు. రాజకీయాల్లో ప్రామాణికత దాదాపు తగ్గిపోతోందని అయితే ఇదే క్రమంలో నిజాయితీ కల్గిన నేతలను తన నమ్మకాలకు బద్ధులుగా ఉండే నేతలను కలుసుకునేందుకు ఇష్టపడతానని రాసుకున్నారు. రాజకీయాలు తన జీవితంలో ఒకభాగమని, అయితే నిరంతర వ్యతిరేకత, సిద్ధాంతాల పరంగా ఉండే రాహుల్‌గాంధీని కలవడం నిజంగా ఓ భిన్నమైన అనుభవమైందన్నారు. కొన్ని క్షణాలు మాట్లాడినా తనలో మరింత గౌరవం పెరిగిందన్నారు. ప్రస్తుతం విద్యార్థినని భవిష్యత్తులో న్యాయవాదిగా తాను రాహుల్‌గాంధీతో కలసి ముందుకు వెళ్లేందుకు ఆశిస్తున్నా అన్నారు. ప్రస్తుతం మనం కొంత ముందస్తు జాగ్రత్తలతో ఆలోచించాలన్నారు. ధవన్ రాకేశ్‌ను ఇటీవలే గదగ్ జిల్లాలో కనకదాసు విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. తాజాగా ఈ పోస్ట్‌లో ధవన్ రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

సిలిండర్ పేలిన ప్రమాదంలో
చికిత్స పొందుతూ నలుగురి దుర్మరణం

ట్రాఫిక్ నియంత్రణకు మరో
105 సీసీ కెమెరాలు

● పని చేయకపోతే తక్షణమే సమాచారం : జాయింట్ పోలీస్ కమిషనర్ కార్తీక్ రెడ్డి

వివరాలు 7లో

ఒక్కటైన జార్కిహొళి బ్రదర్స్

● డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బెంగళూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బెళగావి డీసీసీ బ్యాంకు ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారడంతో పార్టీలు వేరైనా జార్కిహొళి బ్రదర్స్ ఒక్కటయ్యారు. దీంతో గెలుపు తమదేనని సవాల్ చేస్తున్న రమేశ్‌కత్తి వర్గానికి షాక్ ఇచ్చారు. బీజేపీలో ఉన్న రమేశ్‌జార్కిహొళి, మంత్రిగా ఉన్న సతీశ్ జార్కిహొళిలు ఒక్కటి కావడంతో వారివర్గానికి చెందిన ఆరుగురు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీ బ్యాంకుకు 16మంది డైరెక్టర్లలో ఆరుగురు ఏకగ్రీవమయ్యారు. అందులో చిక్కోడి నుంచి గణేశ్ హుక్కేరి, యరగట్టి నుంచి విశ్వాస్‌వైద్య, మూడలగి నుంచి నీలకంఠ, సవదత్తి నుంచి విరూపాక్ష మామని, గోకాక్ నుంచి రమేశ్ జార్కిహొళి కుమారుడు అమరనాథ్, బెళగావి నుంచి సతీశ్‌జార్కిహొళి కుమారుడు రాహుల్ జార్కిహొళి ఏకగ్రీవమయ్యారు. ఈనెల 13న అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బెళగావిలో సహకారసంఘాలకు సంబంధించి రెండు బలమైన రాజకీయ కుటుంబాల మధ్య పోటీ సాగుతోంది. ఎత్తుకుపైఎత్తులు వేస్తున్న తరుణంలో బ్రదర్స్ ఒక్కటయ్యారు.



జార్కిహొళి బ్రదర్స్



మరువ పారుతున్న ఊరుకుంటె చెరువు

పొంగిపొర్లుతున్న చెరువులు

● భారీ వర్షాలతో పెరిగిన ప్రవాహం
● కోలారు జిల్లాలో కూలిన 4 ఇళ్లు
● చింతామణిలో తెగిన కట్ట
● పరిశీలించిన మంత్రి సుధాకర్



దెబ్బతిన్న గుండ్లహళ్ళి మరికుంటె చెరువుకట్టను పరిశీలిస్తున్న మంత్రి సుధాకర్

ముళబాగిలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చెరువులు పొంగి పొర్లుతున్నాయి. కోలారు జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావం ముళబాగిలు తాలూకాలోని 25కుపైగా చెరువులు నిండి మరవ పారుతున్నాయి. 20కిపైగా చెరువులు పూర్తిగా నిండిపోయాయి. చిన్న కుంటలు, చెరువులు ఎటుచూసినా జలకళ సంతరించుకున్నాయి. మరో రెండురోజులు మరవ పారే అవకాశం ఉంది. కాగా వర్షాలకారణంగా పదకాష్టి గ్రామంలోని గంగాధర్‌కు చెందిన ఇల్లు దెబ్బతింది. తాయలూరు హోబళి వేగమడగు గ్రామానికి చెందిన దేవరాజ్ ఇల్లు, ఆవణి హోబళి ఆవలు మరకలుఘట్టి గ్రామంలోని నాగరాజ్‌కు చెందిన ఇల్లు, దుగ్గసంద్ర హోబళి మరళమేడు గ్రామం కళావతికి చెందిన ఇల్లు దెబ్బతిన్నాయి. స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిహారానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. తాలూకాలో ఈనెల 1నుంచి 10వరకు సాధారణ వర్షపాతం 63.4 మి.మీగా ఉంది అయితే ఇప్పటి 214.5 మిమీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా రాగి, అనప, అలసంద, కంది, వేరుశెనగ పంటలకు అనుకూలంగా ఉందన్నారు. అయితే కొన్నిచోట్ల టమోటా, పూలతోటలకు నష్టం వాటిల్లిందన్నారు.

బావుల్లో పెరిగిన నీటిమట్టం

తాలూకాలోని కురుడుమలె, సంగసంద్ర, మాదఘట్టె, సిద్దఘట్టె, శెట్టిబణకనహళ్ళి, ఎస్ చిదుమనహళ్ళి, దొమ్మసంద్ర, ఇండ్లకెరె, తాయలూరు, తట్టనకుంటె, దేవరాయసముద్ర, గోకుంటె, హొసకెరె, హొన్నశెట్టిహళ్ళి, సోమేశ్వరకెరె, ఊరుకుంటె, మల్లప్పనహళ్ళి చెరువు తదితర చెరువులు మరవ పారుతున్నాయి. సుదీర్ఘకాలం తర్వాత తాలూకాలో మంచి వర్షాలు నమోదు కావడంతో బోరుబావులలో నీటిమట్టం పెరగనుంది. చెరువులు, కుంటలలో నీరు లభ్యం కావడంతో పశు పక్షాదుల దాహం తీరనుంది. కాగా కొన్ని గ్రామాలలో రాజకాలువలు ఆక్రమణకు గురి కావడంతో వర్షపునీరు సజావుగా ప్రవహించక రోడ్లపైకి వస్తోంది. గురు, శుక్రవారాలలో రాత్రివేళల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ రెండురోజులుగా కురిసిన వర్షాలతో 4ఇళ్లు, 5కుపైగా విద్యుత్‌స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. గ్రామాల్లో పంట నష్టంపై అంచనా వేస్తున్నారన్నారు. యుద్ధప్రాతిపాదికన మరమ్మతు చేయడం లేదా కొత్తవి ఏర్పాటు చేసే పనులలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోందన్నారు.



కురుడుమలె చెరువు

తెగిన గుండ్లహళ్లి చెరువుకట్ట

చింతామణి (ఆంధ్రజ్యోతి): తాలూకాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు మరవ పారుతున్నాయి. మురగమల్లా హోబళి యగవకోటె, పెద్దూరు గ్రామపంచాయతీలలోని చెరువులు నిండాయి. గుండ్లహళ్ళి గ్రామ చెరువు కట్ట తెగి మరో చెరువుకు నీరు వెళ్లింది. చెరువు కట్ట తెగిందనే విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్పందించారు. వెంటనే గుండ్లహళ్ళి మరికంటె చెరువుకు శనివారం వెళ్లి పరిశీలించారు. అప్పటికే అధికారులు, స్థానికులతో కలసి ఇసుకబస్తాలతో అడ్డుకట్ట వేశారు. తాత్కాలికంగా నీరు వృథా కాకుండా సరైన చర్యలు చేపట్టడంపై మంత్రి అభినందించారు. ఈ నేపథ్యంలో చెరువుల కట్టల సామర్థ్యం, నీటి ప్రమాణం స్థితిగతులపై అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవలికాలంలో వర్షం కొరత కారణంగా ఎలుకలు పెద్దసంఖ్యలో చెరువుకట్టలో బొరియలు పెట్టడంతోనే సమస్య తలెత్తిందన్నారు. మూడేళ్ల తర్వాత చెరువులు నిండి మరవ పారుతున్నాయన్నారు. పెద్దూరు గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మలహళ్ళి చెరువు, యగవకోటె పంచాయతీ పరిధిలోని కొండవెనహళ్ళి గ్రామానికి చెందిన చిన్నచెరువు, ముద్దుకుంటె చెరువుతోపాటు పెద్ద చెరువులు అప్పనకెరె, కుంటోరపల్లి చెరువులు నిండి మరవ పారుతున్నాయి. తాలూకా తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్, చిన్ననీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



యగవకోటె సమీపాన మరువ పారుతున్న తుమ్మలహళ్ళి చెరువు



గడ్డి బేల్స్ తయారు చేస్తున్న మిషన్



గడ్డిని మిషన్‌లో వేస్తున్న కూలీలు

పంట పండిన ఆలోచన



సిద్ధంగా ఉన్న గడ్డి బేల్స్

- శైలేజ్ గడ్డి తయారీని ప్రారంభించిన ఇద్దరు రైతులు
- నాలుగేళ్ల క్రితం స్థానిక అవసరాలకు ఉత్పత్తి
- సబ్సిడీ రుణాలతో విస్తరించిన వ్యాపారం
- ఇతర రైతులు.. కూలీలకు పెరిగిన ఆదాయం

విడపనకల్లు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇద్దరు రైతుల ఆలోచన వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసే రైతుల ఆదాయాన్ని పెంచింది. శైలేజ్ గడ్డిని తయారు చేయడం ద్వారా లాభాలను ఆర్జించేలా చేసింది. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన నజీర్, కరకముక్కల గ్రామానికి చెందిన ఉమా మహేష్ నాలుగేళ్ల క్రితం చిన్న యంత్రం సాయంతో శైలేజ్ గడ్డిని తయారు చేసి, అక్కడే అమ్మేవారు. ప్రభుత్వ సహకారంతో సబ్సిడీ రుణాలు తీసుకుని రూ.18 లక్షలతో గడ్డి బేల్స్ తయారు చేసే రెండు మిషన్లు, రూ.8 లక్షలతో రెండు ట్రాక్టర్లను వీరు కొనుగోలు చేశారు. కరకముక్కల వద్ద ఓ పొలంలో 8 నెలల క్రితం గడ్డి బేల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు రైతులు కలిసి దాదాపుగా రూ.1.25 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీగా రూ.45 లక్షలు ఇచ్చింది. నెలకు రూ.1.20 లక్షలు కంతులు చెల్లిస్తున్నారు. సుమారు 20 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు.

సహజసిద్ధంగా..

సంచులకు నింపే సమయంలో మిక్స్ చేసిన మొక్కజొన్న గడ్డిలో ఎలాంటి కెమికల్స్, ఇతర పదార్థాలు కలపడం లేదు. పొలంలో ఉన్న పంటను కోసి మిక్స్ చేసి బేల్స్ గాను, సంచులకు నింపి ప్యాక్ చేస్తారు. ఈ విధంగా చేయటం వల్ల ఏడాది పాటు ఉంచినా పాడి పశువులు, గొర్రెలు, మేకలకు పచ్చి గడ్డిగా వాడుకోవచ్చు అంటున్నారు. బేల్స్ సిద్ధమయిన తరువాత జిల్లాలోని డెయిరీలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. బేల్స్‌ను ఒక్కొక్కటి 55 నుంచి 60 కిలోలు, సంచులకు 35 నుంచి 36 కిలోల వరకూ ప్యాక్ చేస్తారు. ఒక టన్ను గడ్డి రూ.6 వేలకు విక్రయిస్తారు. ఇక్కడ తయారు చేసిన గడ్డి బేల్స్‌ను, సంచులను హైదరాబాద్, మహారాష్ట్ర, కడప, బెంగళూరు. తిరుపతి, శ్రీకాళహస్తి, ఇస్కాన్ టెంపుల్, అనంతపురం వంటి పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు ఇక్కడికే వచ్చి గడ్డి బేల్స్‌ను కొనుగోలు చేసుకుని వెళుతున్నారు.

పెరిగిన సాగు

విడపనకల్లు మండలంలోని జీబీసీ కాలువ, బోరు బావుల కింద వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయించారు. సాగు చేసిన రోజు నుంచి 80 రోజులకు పాల కంకిగా ఉన్న సమయంలోనే పంటను శైలేజ్ గడ్డి తయారీకి కోతలు కోస్తారు. పాల కంకి మీద కోత కోయటంతోనే అధిక పోషకాలు ఉంటాయని.. 120 రోజుల పంటను 80 రోజులకే కోస్తారు. దీంతో రైతులు కేవలం 80 రోజులకే ఎకరా పంటను రూ.40వేల నుంచి రూ. 45 వేల వరకూ విక్రయిస్తున్నారు. రైతుల వద్ద నుంచి నేరుగా వీళ్లే కొనుగోలు చేసి పొలంలోనే కటింగ్ చేయించి మిషన్‌కు వేసి బేల్స్, సంచులకు నింపుతారు. గతంలో కూలీలతో మొక్క జొన్న పంటను కోయించి మిషన్లకు ఆడించే వారు. చిన్న కటింగ్ మిషన్ తెచ్చిన తరువాత పొలంలోనే మిక్స్ చేసి నేరుగా ప్యాకింగ్‌కు పంపుతున్నారు. ప్యాకింగ్ చేసే చోట రోజు 20 మంది కూలీలు పని చేస్తుంటారు. కరకముక్కల, హావళిగి, పాల్తూరు, చీకలగురికి, ఉండబండ, మాళాపురం, విడపనకల్లు, ఆర్. కొట్టాల తదితర ప్రాంతాల్లో మొక్క జొన్న పంట సాగు చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలతో విస్తరించాం..





నాలుగేళ్లుగా రెండు చిన్న మిషన్లతో శైలేజ్ గడ్డి తయారు చేసి దగ్గర ప్రాంతాల్లోనే విక్రయించే వాళ్లం. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వడంతో ఎనిమిది నెలల క్రితం మరో రెండు కొత్త మిషన్లు కొనుగోలు చేసి విస్తరించాం. అప్పటి నుంచి కరకముక్కల వద్ద శైలేజ్ గడ్డి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. చుట్టు పక్కల రైతుల పొలాల్లోనే మొక్క జొన్న పంట సాగు చేయించి వాటిని కొని పచ్చి గడ్డితో బేల్స్ సంచులకు నింపి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నాం.

- నజీర్, ఉమా మహేష్, శైలేజ్ గడ్డి తయారీదారులు

రూ.6 లక్షల లాభం



నేను ఈ సంవత్సరం 10 ఎకరాల్లో రెండుసార్లు మొక్క జొన్న పంటను సాగు చేశాను. పెట్టుబడులు పోను రూ. 6లక్షలు వరకూ లాభం వచ్చింది. గతంలో మొక్క జొన్నకు కోతలు, కంకి మిషన్‌కు వేయడానికి, విక్రయించడానికి నానా తిప్పలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు శైలేజ్ గడ్డికి వాళ్లే పొలంలోకి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మార్కెట్ ధర ఎలా ఉన్నా ఎకరాకు రూ. 40 నుంచి రూ.45వేలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. 120 రోజుల పంటను 80 రోజులకే కటింగ్ చేస్తున్నారు. **- రుద్రన్న రైతు, కరకముక్కల**

మూడు కోతలు ఇచ్చాను



నేను ఆరు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. ఇప్పటికే మూడు కోతలు (పంటలు) వచ్చాయి. ఎకరాకు రూ. 40 వేల ప్రకారం తీసుకున్నారు. పాల కంకి మీద పంటను 80 రోజులకే తీసుకోవటంతో పంట కోత బాధ లేదు. అంతా శైలేజ్ గడ్డి నిర్వాహకులే చూసుకుంటున్నారు. మాలాంటి ఎంతో మంది రైతులతో సాగు చేయించి లాభాలు చూపుతున్నారు. గతంలో మిరప, ఇతర పంటలు సాగు చేసి నష్టాలపాలయ్యాను. శైలేజ్ గడ్డికి విక్రయాలతో ప్రశాంతంగా ఉన్నాం. **- నాగేష్, రైతు, కరకముక్కల**

రోజుకు రూ.800 కూలి..



నేను గతంలో పొలం పనులకు వెళితే రోజుకు రూ. 300 నుంచి రూ.400 మాత్రమే ఇచ్చేవారు. కరకముక్కలలో శైలేజ్ గడ్డి మిషన్లు నింపేందుకు వెళుతున్నా. రోజుకు రూ. 800 కూలి ఇస్తున్నారు. మిషన్ల వద్ద పని చేసే వారు కాకుండా కూలీలమే 20 మందికి పైగా ఉన్నాం. మాకు నెలకు ఒక్కొక్కరికి రూ. 20వేలు పైనే వస్తోంది. చేతి నిండా పని ఉంది. ఎవరి పనికి వెళ్లాలనే ఆలోచన కూడా లేదు. మా కుటుంబాలు గడవటానికి ఎలాంటి ఇబ్బంది లేదు. **- సురేష్, కూలీ, పాల్తూరు**

రోజూ పని దొరుకుతోంది..



గతంలో ఒక రోజు పని ఉంటే, మూడు నాలుగు రోజులు ఇంటి వద్దే ఉండేవాడిని. పని లేక నానా ఇబ్బందులు పడ్డా. ఇప్పుడు ఆ ఆలోచనే లేదు. రోజూ శైలేజ్ గడ్డి తయారీ కేంద్రానికి వచ్చి పనులు చేసుకుంటున్నాం. ఎనిమిది నెలలుగా మాకు చేతి నిండా పని దొరికింది. రోజు కూలి రూ. 800 ఇస్తున్నారు. మా కుటుంబ సభ్యులు అందరికి చేతి నిండా పని దొరికింది. **- రవి, కూలీ, కరకముక్కల**

సమానత్వం కోసం పోరాటం

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



ముగింపు సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో, కుటుంబంలో మహిళ పట్ల వివక్ష కొనసాగుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. అందుకే సమానత్వం కోసం ఐద్వా పోరాడుతోందని అన్నారు. పోరాటంలో అందరూ భాగం కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా 16వ మహాసభల నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 13 నుంచి నగరంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన కోరారు. 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం లలిత కళా పరిషత్‌లో సభ ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 16 వేల ముగ్గులతో రాష్ట్ర మహా సభలకు స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం కాలనీ, ఇందిరా నగర్, సీతారామ్ ఏచూరి కాలనీ, గణేనాయక్ కాలనీ, మహదేవనగర్ తదితర ప్రాంతాల్లో ఐద్వా రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మహిళలు ముగ్గులను వేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి ముగ్గులను పరిశీలించారు. ముగ్గులు వేసిన వారిని వారు అభినందించారు.

ముగిసిన సాంస్కృతికోత్సవాలు

ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సాంస్కృతికోత్సవాలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. తొలి రెండురోజులు కృష్ణకళామందిర్‌లో, మూడో రోజు శనివారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం ఐద్వా నాయకురాలు ప్రగతి అధ్యక్షతన ముగింపు సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా రేడియో వ్యాఖ్యాత శ్యామసుందర శాస్త్రి, కవి షేక్ రియాజుద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషు, అశ్విని, జిల్లా నాయకులు రామాంజినమ్మ, గీత, శైలజ, పద్మావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిరి, పరమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన



పైసలిస్తేనే పేరు మార్పు!



- రేషన్ డీలర్ల పేర్ల మార్పునకు మామూళ్లు
- అనంతపురం అర్బన్‌లో అవినీతి బాగోతం



అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో పని జరగాలంటే పైసలు ముట్టజెప్పాల్సిందేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్‌షాపు డీలర్ల పేరు మార్పునకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పౌరసరఫరాల విభాగంలో అధికారులు, ఉద్యోగుల మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తున్నట్లు సమాచారం. అనంతపురం అర్బన్ పరిధిలో 137 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూటమి పార్టీల సానుభూతిపరులకు కేటాయించారు. అప్పటి వరకు ఉన్న వైసీపీ డీలర్ల పేర్లతో ఉన్న దుకాణాలను కూటమి నేతల పేర్లు మీదుగా మార్పు చేశారు. అయితే కొన్నింటిని మార్చలేదు. ఇలాంటివి ఇరవై వరకు ఉన్నట్లు సమాచారం. సంబంధిత వీఆర్వోల లాగిన్ ద్వారా ఈ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు రేషన్ సరఫరా చేసేవారు. దీనివల్ల సమస్యలు వస్తుండటంతో ఆ డీలర్లు దుకాణాన్ని తమ పేరుమీదుగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల పది దుకాణాలకు సంబంధించి డీలర్ల పేర్లు మార్చారు. మిగిలినవి కూడా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ఒక్కో డీలర్ నుంచి రూ.10వేలు ముడుపులు పుచ్చుకున్నట్లు సమాచారం.

బఫర్ క్లియర్‌కు పెద్ద మొత్తంలో వసూలు

కొత్త డీలర్లు బఫర్ స్టాక్‌తో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వంలోని డీలర్ల నుంచి క్లియర్ చేయాల్సి ఉండగా, ప్రస్తుత డీలర్లే బఫర్ స్టాక్ క్లియర్ చేయాలని సంబంధిత అధికారులు ఒత్తిడి పెంచారు. ఈక్రమంలోనే వారిపై 6ఏ కేసులు నమోదు చేశారు. ఎక్కువ మొత్తంలో బఫర్ స్టాక్ ఉన్న డీలర్ల నుంచి పెద్ద మొత్తంలోనే వసూలు చేసి బఫర్ క్లియర్ చేయించినట్లు తెలిసింది. అనంతపురం తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలోని ఓ రేషన్ షాపులో బఫర్ స్టాక్ క్లియరెన్స్‌కు సంబంధిత డీలర్ నుంచి రూ.75వేలు, మరో షాపులో ఇదే విధంగా రూ.లక్ష వరకు ముడుపులు అందుకున్నట్లు సమాచారం.

మా దృష్టికి రాలేదు



డీలర్ల పేర్ల మార్పు, బఫర్ క్లియర్‌కు డబ్బులు తీసుకున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదు. క్షేత్రస్థాయిలో విచారిస్తాం. అలాంటివి ఏవైనా జరిగినట్లు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- హరికుమార్, తహసీల్దార్, అనంతపురం అర్బన్

చీనీ టన్ను రూ.15వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.12వేలు ధర పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 34 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

నీటి మాటలు..!

హెచ్చెల్సీ నీటి నిర్వహణలో గందరగోళం

- లెక్కలు చెప్పలేకపోతున్న ఇంజనీర్లు
- అస్తవ్యస్తంగా వ్యవహారాలు
- ఐఏబీ నిర్వహణలో తీవ్ర జాప్యం



హెచ్చెల్సీ

జిల్లా కరువును పారదోలేందుకు ఉన్న ఏకైక మార్గం నీరు. అలాంటి నీటి నిర్వహణలో అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారు. జిల్లాకు జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నీటి నిర్వహణను గాలికొదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏకంగా 13 టీఎంసీల నీరు తీసుకుంటే.. ఎక్కడ ఇచ్చామన్న లెక్కలు కూడా ఇంజనీర్లు చెప్పలేకపోతుండడం శోచనీయం. జలాశయాలు నింపామంటూ దాటవేస్తున్నారు. నెలలుగా రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడంతో ఈఈలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. కొందరు అధికారులు ఆఫీసుల వైపు కూడా చూడట్లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కీలకమైన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహణలో కూడా జాప్యం చేస్తున్నారంటే వారి నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి జూలై 16వ తేదీన నీరు విడుదల చేశారు. అప్పటి నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. అప్పటి లెక్కల ప్రకారం టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 24.065 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటి వరకు 12.710 టీఎంసీలు విడుదల చేయగా.. 105వ కిలోమీటరు వద్ద సరిహద్దుకు 11.510 టీఎంసీలు చేరింది. హంద్రీనీవా నుంచి మరో రెండు టీఎంసీల నీరు హెచ్చెల్సీకి తీసుకున్నారు. మొత్తం 13 టీఎంసీల నీటిని ఎక్కడ.., ఏయే ప్రాంతాలకు వినియోగించారనే అంశంపై హెచ్చెల్సీ ఇంజనీర్ల వద్ద లెక్కలు లేకపోవడం శోచనీయం. 85వేల ఎకరాల ఆయకట్టుకు 3.344 టీఎంసీల సాగునీరు ఇచ్చామని హెచ్చెల్సీ ఇంజనీర్లు చెబుతున్నా.. ఆ స్థాయిలో నీరు చేరలేదని క్షేత్రస్థాయిలో రైతులు చెబుతున్నారు. ఇది హెచ్చెల్సీ నిర్వహణ అస్తవ్యస్తం, గందరగోళానికి మరింత ఊతమిస్తోంది. వచ్చిన నీటిని సక్రమంగా నిల్వ చేసి, ఆయకట్టుకు వదిలి, తాగునీటి అవసరాలకు సక్రమంగా పంపిణీ చేయాల్సిన హెచ్చెల్సీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇలా హెచ్చెల్సీ పాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఏటా నిర్వహించే ఐఏబీ సమావేశం ఏర్పాటులో విఫలమవుతున్నారు. ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లోనే ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, విడుదల తేదీలను నిర్ణయించేవారు. హెచ్చెల్సీలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల కారణంగా ఐఏబీ నిర్వహణలో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంజనీర్లది తలోదారి...

హెచ్చెల్సీ పరిధిలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. హెచ్చెల్సీ, హెచ్చెల్సీ లోక్, ఐబీ, ధర్మవరం బ్రాంచ్ కెనాల్ డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈలు) సక్రమంగా పనిచేస్తేనే ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందించగలరు. హెచ్చెల్సీ డివిజన్ ఈఈ ఎప్పుడు కార్యాలయానికి వస్తారో... అక్కడ పనిచేసే సిబ్బందికి కూడా సమాచారం ఉండదని తెలుస్తోంది. నిత్యం క్షేత్రస్థాయిలో ఉన్నట్లు చెబుతూ ఇంటికే పరిమితమవుతూ ఈఈ విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. మిగిలిన ఇంజనీర్లు కూడా అదే పరిస్థితిలో ఉన్నారు. ఈఈలే ఇలా ఉంటే.. డీఈలు, ఏఈల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

రెగ్యులర్ ఎస్ఈ కరువు

హెచ్చెల్సీకి రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడం శోచనీయం. రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో మే నెలలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జూన్‌లో విశ్వనాథ్‌రెడ్డిని కూడా తప్పించి మైనర్ ఇరిగేషన్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న సుధాకర్ రావును హెచ్చెల్సీ ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. అప్పట్నుంచీ ఇన్‌చార్జి పాలనే. విధి నిర్వహణలో ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ ఆ శాఖలో సాగుతోంది. రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడంతో ఐఏబీ నిర్వహణలోనూ జాప్యం అవుతోంది. దీంతో రైతులు ఆయకట్టుకింద సాగుచేసిన పంటలకు సక్రమంగా నీరు అందక నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

అంతా సరిదిద్ది.. ఐఏబీలో నిర్ణయిస్తారు



హెచ్చెల్సీలో అన్నింటినీ సరిదిద్ది... వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో ఉన్నాం. నీటి కేటాయింపుల విషయంపై ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రణాళిక రూపొందిస్తాం. త్వరలో ఐఏబీ సమావేశం నిర్వహించి, నీటి కేటాయింపులు, విడుదల తేదీలను ఖరారు చేస్తారు. ఆ మేరకు కాలువలకు నీరు విడుదల చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు టీబీ డ్యాం నుంచి, హంద్రీనీవా ద్వారా తీసుకున్న నీటిని ఆయా రిజర్వాయర్లలో నిల్వ చేశాం.

- సుధాకర్‌రావు, హెచ్చెల్సీ ఎస్ఈ


జిల్లా టీచర్‌కు రాష్ట్ర పదవి

- పండిత పరిషత్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక



అనంతపురం విద్య, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయపండిత పరిషత్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనంతపురం జిల్లాకు చెందిన ఎర్రిస్వామి నియమితులయ్యారు. గుంటూరులో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎంపిక జరిగింది. అందులో జిల్లాకు చెందిన ఎర్రిస్వామిని ఏకగ్రీవంగా నియమించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన ఎర్రిస్వామికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమేష్, తులసిరెడ్డి, నాయకులు గురివిరెడ్డి, సంజీవ్‌కుమార్, గోపాల్, నవీన్, ధనుంజయ, రమణారెడ్డి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఎర్రిస్వామి ఉరవకొండ మండలం మోపిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు 1,650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.12, సరసరి రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు.

రేపటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు



ఎఫ్ఏ-2 ప్రశ్నపత్రాల తరలింపును పర్యవేక్షిస్తున్న డీసీఈబీ సెక్రెటరీ శ్రీనివాసులు

అనంతపురం విద్య, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఎఫ్ఏ-2 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమికపాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉదయం 9-30 నుంచి 10-45 వరకు, మధ్యాహ్నం 1-15 నుంచి 2-30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి మూడు రోజులు కొనసాగనున్నాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉదయం రెండు, మధ్యాహ్నం రెండు చొప్పున సబ్జెక్టుల వారీగా పరీక్షలు నాలుగు రోజులు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలు ముద్రించి జిల్లాకు పంపారు. వాటిని జిల్లా పరీక్షల విధాన మండలి ఆధ్వర్యంలో ప్రాథమిక పరీక్షల ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌లకు, 6నుంచి10వరకు ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలకు ఇప్పటికే తరలించారు. ఏరోజు పరీక్ష ప్రశ్న పత్రాలను ఆరోజే గంట ముందు మాత్రమే సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు లేదా టీచర్లు తీసుకెళ్లాల్సి ఉంటుందని డీసీఈబీ సెక్రెటరీ గంధం శ్రీనివాసులు తెలిపారు.

అర్ధ శతాబ్దపు అనుబంధం

- ఎస్కేయూలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

వర్సిటీలోని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ వద్ద పూర్వ విద్యార్థులు



అనంతపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 1975-77 ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. ఆనాటి విద్యార్థులంతా ఐదు దశాబ్దాల తర్వాత ఒక చోట కలిసి ఉల్లాసంగా గడిపారు. వర్సిటీలో వారు చదివిన క్లాస్ రూమ్‌లలో తిరుగాడారు. ఈ కార్యక్రమానికి కెమిస్ట్రీ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అప్పటి విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానంతోనే లెక్చరర్లు, ప్రొఫెసర్లుగా స్థిరపడి సమాజసేవ చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆర్‌ఐఓ క్రిష్టప్ప అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు వైజాగ్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి రంగనాయకులు, ఉదయ్ కుమార్, ఆదోని నుంచి గోవిందరాజులు, తంజావూరు నుంచి హిదయతుల్లా, కర్నూలు నుంచి సుబ్బక్రిష్ణ, చంద్రశేఖర్, వెంకటకృష్ణ తదితరులు హాజరయ్యారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విజయ్ మర్చంట్ (జయంతి)



దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర చాటిన ప్రముఖ క్రికెటర్ విజయ్‌సింగ్ మాధవ్ జీ మర్చంట్ 1911 అక్టోబరు 12న బాంబేలో జన్మించారు. రైట్ ఆర్మ్ మీడియం పేస్ బౌలర్. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌తో పాటు 1929-51ల మధ్య 10 టెస్ట్‌మ్యాచ్‌లు ఆడారు. బ్యాటింగ్ సగటు 71.64. బాంబే స్కూల్ ఆఫ్ బ్యాట్స్‌మన్‌షిప్ స్థాపకుడు. ఆయన అంతర్జాతీయ కెరీర్‌లో రెండు ఇంగ్లండ్ పర్యటనలు ఉన్నాయి. అందులో అతను 800కంటే ఎక్కువ పరుగులు చేశారు. రంజీ ట్రోఫీలో మహారాష్ట్రపై 359 పరుగులు చేయడం ద్వారా అగ్రస్థానంలో నిలిచారు. క్రికెట్‌లో తనదైన రికార్డులు నెలకొల్పారు. 1987 అక్టోబరు 27న కన్నుమూశారు.

తిరుమల రామచంద్ర (వర్ధంతి)



'మహా మహోపాధ్యాయ'గా పేరొందిన తిరుమల రామచంద్ర 1913 జూన్ 13న అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలో జన్మించారు. సంపాదకుడు, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, భాషావేత్త. పలు పత్రికలలో వివిధ హోదాలలో కొనసాగారు. మన లిపి - పుట్టుపూర్వోత్తరాలు, నుడి నానుడి, సాహితీ సుగతుని స్వగతం తదితర రచనలు ప్రముఖమైనవి. ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం, సాహిత్య అకాడమీ అవార్డు, పత్రకార శిరోమణి, కళా సరస్వతి, మహామహోపాధ్యాయ బిరుదులు పొందారు. 1997 అక్టోబరు 12న మరణించారు.

నగరంలో మ్యాక్స్ ఫ్యాషన్ మరోశాఖ

బెంగళూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ రంగంలో గుర్తింపు పొందిన మ్యాక్స్ ఫ్యాషన్ తన బ్రాండ్‌ను విస్తరించుకునేలా నగరంలో మరోశాఖను ఏర్పాటు చేసింది. ఫీనిక్స్‌మార్కెట్‌సిటీ మాల్‌లో తన శాఖను ఏర్పాటు చేసినట్టు నగరంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నేటి యువతరం ఇష్టపడే అన్నిరకాల ఫ్యాషన్ దుస్తులు ఇక్కడ లభ్యమని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పేరుండే బ్రాండ్‌లు లభిస్తాయని సీఈఓ సుమిత్‌చందన తెలిపారు.

వర్క్‌ఈజీ కేంద్రం ప్రారంభం

బెంగళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిన ప్రముఖ నిర్వహణ కార్యాలయాల స్థలాలను సమకూర్చడంలో పేరొందిన వర్క్‌ఈజీ సంస్థ బెంగళూరులో తన తొలి కేంద్రాన్ని ప్రారంభించింది. 2లక్షల చదరపు అడుగుల కేంద్రంలో ఏర్పాటైంది. 3,300కుపైగా ప్రీమియం సీట్లు, కార్యకలాపాలకు తగిన స్థలం, బ్రేక్‌అవుట్ స్థలం ఉంది. సంస్థ ప్రధాన డైరెక్టర్ ప్రతాప్ మురళి మాట్లాడుతూ 0.1 మిలియన్ చదరపు అడుగులతో ప్రారంభమై ప్రస్తుతం 1.25 మిలియన్ చదరపు అడుగులకు విస్తరించామన్నారు 3 నగరాలలో శాఖలు ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాయచూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మస్కి తాలూకా సంతేకల్లూరు గ్రామం పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో బైక్ పై వెళుతున్న వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఎదురెదురుగా వస్తున్న కారు బైకు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కారు బోల్తాకొట్టగా అందులో ప్రయాణిస్తున్న మహిళ, ఒక బాలికతో పాటు నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ పై వెళుతున్న వ్యక్తిని మస్కి తాలూకా హొన్నూరుకు చెందిన వీరేశ్()గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మస్కి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎస్ఐతో కలిసి సంఘటన స్థళాన్ని పరిశీలించారు. సంఘటనకు సంబంధించి మస్కి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

పీఎస్ఐపై సస్పెన్షన్ వేటు

రాయచూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇడపనూరు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన సౌమ్య పై బళ్ళారి ఎస్పీ సస్పెండ్ వేటు వేశారు. ఇక్కడ పని చేస్తున్న సమయంలో ఒక పొలం వివాదానికి సంబంధించి బాధితుడి వద్ద లంచం డిమాండ్ చేసిన ఆడియో ఒకటి అప్పట్లో వైరల్ కాగా ఆమెను కొన్నాళ్ల క్రితం బళ్ళారి ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయి విచారణ అనంతరం బళ్లారి ఎస్పీ ఆమెను సస్పెండ్ చేస్తు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొలం వివాదంలో నిందితుడిగా ఉన్న వ్యక్తి తొలి ముద్దాయిగా ఉన్న వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్ నుంచి తొలగించేందుకు సంబంధిత బాధితుడి బంధువుల నుంచి ఆమె ఫోన్ ద్వారా లంచం డిమాండ్ చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఆర్ఎస్ఎస్ శతవసంతోత్సవాలు

శెట్బూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొచ్చుపల్లిలో రాష్ట్రీయ స్వయం సేవక్ శత వసంతోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారక్ లక్ష్మణ్ కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

- బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో పాండురంగస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ శత వసంతోత్సవాలను నిర్వహిం చారు. కార్యక్రమంలో సంఘ్ ప్రచారక్‌లు గిరి, రామణ, స్వయంసేవకులు పెద్దిరెడ్డి, దేవరెడ్డి, మంజునాథ్, రవీంద్రనాథ్, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

ఘనంగా తిమ్మప్పస్వామి మహోత్సవం

రాయదుర్గం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లిలో యాదవుల ఇలవేల్పు దేవుడైన తిమ్మప్పస్వామి మహోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మహోత్సవంలో భాగంగా ఆవులదేవరా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి ఊరికి చివరన ఆవులగూడును ఏర్పాటు చేసి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

గుమ్మఘట్ట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడులో వాల్మీకి మహర్షి జయంతిని శనివారం నిర్వహించారు. వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

సమాజంలో ఆధ్యాత్మిక ఆలోచనలు పెరగాలి

- మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవరాజ్ భట్

బెంగళూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆధ్యాత్మిక భావనలు పెరగాల్సిన అవసరం ఉందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవరాజ్ భట్ అన్నారు. తద్వారా శతాబ్దాలుగా వస్తున్న సనాతన సంప్రదాయాలను పాటించినట్లు అవుతుందని అన్నారు. శ్రీధర్ గుమ్మరాజు రచించిన 'ఆధ్యాత్మిక భక్తి - అద్వైత చింతనగళు' పుస్తకాన్ని శనివారం విడుదల చేశారు. యలహంక ఆవలహళ్ళిలోని ఎస్ఆర్‌వీవీ ఆశ్రమంలో పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో దేవరాజ్‌భట్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు సంబంధించి ఎన్నో అంశాలను పుస్తకంలో ప్రస్తావించారన్నారు. పుస్తకం చిన్నదైనా పలు ఆధ్యాత్మిక విధి విధానాలను నేటితరంకు అర్థమయ్యేలా ఉన్నాయన్నారు. శంకరాచార్యులు భగవద్గీత, ఉపనిషత్తులను రచించని పక్షంలో మన ఆలోచనలు మరోవిధంగా ఉండేవన్నారు. ఆశ్రమ అధ్యక్షులు అభయానంద మహరాజ్ మాట్లాడుతూ ఎన్నో పుస్తకాలను ఇక్కడ విడుదల చేశామని, కొందరు పుస్తకాలు తీసుకెళ్లి కొన్నిరోజులకే వాపసు చేస్తారన్నారు. పుస్తకం ఇంట్లో ఉంటే ఏదో ఒక్కసారైనా చదువుతామనే ఆలోచన వస్తుం దన్నారు. రచయిత శ్రీధర్ గుమ్మరాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక అంశాలపై కొంతకాలంగా సోషల్‌మీడియాలో పోస్టింగ్ చేసేవాడినని, ఇటీవలే కొందరు ఆప్తుల సలహాల మేరకు పుస్తకం తీసుకొచ్చామన్నారు. జగద్గురు శివానంద భారతి చింతామణి స్వామిజీ ఆశీస్సులతో పుస్తకం రూపొందించామన్నారు. ప్రతి ఇంటా ఆధ్యాత్మిక అంశాలు రోజుకు కొంత సమయమైనా చర్చించు కోవాలని, అదే రేపటి తరానికి పునాది కానుందని శ్రీధర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్‌తోపాటు శ్రీధర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవరాజ్ భట్, స్వామిజీ తదితరులు

ఆటో నడుపుతూ మహిళ జీవనం



ఆటో నడుపుతున్న కవిత

దొమ్మసంద్ర, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో సామాన్యుల నుంచి శ్రీమంతులదాకా జీవనం సాగిస్తున్నారు. అందులోనూ నిత్యం రద్దీగా ఉండే రహదారులపై ఆటో నడుపుతూ జీవనం కొనసాగించడం ఎంతో క్లిష్టమైనది. ఇటీవలి కాలంలో మహిళలకు అండగా నిలిచేలా పలు స్వచ్ఛంద సంస్థలు వస్తున్నాయి. కోరమంగల జక్కసంద్ర నివాసి కవితా సుమారు రెండేళ్లుగా ఆటో నడపడం ద్వారా జీవనం చేస్తున్నారు. భర్త వదిలివేయడంతో కుటుంబ పోషణకోసం కొంతకాలం ఇంటిపనులు చేసేవారు. ప్రస్తుతం కుమారుడు ఆకాశ్ బీఎస్సీ చదువుతుండగా, కుమార్తె పీయూసీ మొదటి సంవత్సరం చదువుతోంది. కవితా మీడియాతో మాట్లాడుతూ ఉద యం 9 నుంచి రాత్రి 9 వరకు ఆటో నడుపుతానన్నారు. నిత్యం విభిన్నమైన ప్రయాణీకులు తారసపడుతుంటారన్నారు. ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయంతోనే పిల్లల చదువు, కుటుంబ పోషణ అవుతోందన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న కవితా జీవనం స్థానికంగా ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

ఘనంగా అణ్ణమ్మదేవి ఉత్సవం

బెంగళూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జయనగర్ సిద్దాపురలోని వరసిద్ధి వినాయక గెళెయర బళగ ఆధ్వర్యంలో తొలి వార్షికోత్సవంలో భాగంగా అణ్ణమ్మదేవి ఉత్సవం ఘనంగా కొనసాగుతోంది. బెంగళూరు నగరదేవత అణ్ణమ్మదేవి, గ్రామదేవతలు బండి మహంకాళిదేవి, మారమ్మ దేవతా మూర్తులను శుక్రవారం ప్రత్యేకంగా కొలువుదీర్చారు. శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం విశేషపూజల అనంతరం పురవీధులలో గ్రామదేవతలను ఊరేగించనున్నారు. అంతకు ముందు భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



కొలువుదీరిన గ్రామదేవతలు

పౌరకార్మికుల సేవలు అపారం



దుస్తులు పంపిణీ చేస్తున్న నాగరాజు

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగరాజు

బొమ్మనహళ్ళి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహానగరంలో పౌరకార్మికుల సేవలు అపారమని వారికి నగర ప్రజలు రుణపడి ఉంటారని హెచ్ఎస్ఆర్ లే అవుట్ మంగమ్మనపాళ్యలో ఏర్పాటు కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగరాజు అభిప్రాయపడ్డారు. దసరా, దీపావళిని పురస్కరించుకుని 75మంది పౌరకార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 నుంచి దసరా, దీపావళి సందర్భంగా పౌరకార్మికులకు ప్రతి సంవత్సరం పౌరకార్మికులకు దుస్తులు, మిఠాయిలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛతకోసం కృషి చేస్తున్న పౌరకార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. వారిసేవల వల్లనే క్లీన్‌సిటీగా సాధ్యమన్నారు. పౌరకార్మికులకు స్వచ్ఛంద సంస్థలు తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. కాగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు నారాయణస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

సిరుగుప్ప, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 150 జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు సూచించారు. శనివారం సిరుగుప్ప పట్టణంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఎన్‌హెచ్ అధికారులతో చర్చించారు. పనులు మందకొడిగా సాగుతుండటంతో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయని, అధికారులు సోమరితనం వీడాలన్నారు. టెక్కలకోట పట్టణం నుంచి దడేసూగూరు గ్రామం వరకు తక్షణమే పనులను వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో విద్యుత్ స్తంభాలు తొలగించాలని జెస్కామ్ ఇంజనీర్లకు సూచించారు. పైపులైన్లను రహదారి పక్కనే వున్న పైపులైన్లను రహదారి చివరికి వేయాలని సూచించారు. ఈ సందర్భంగా నగరసభ కమీషనర్ గంగాధర, జెస్కామ్ ఏఈ రాఘవేంద్ర, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సీజేపై దాడికి యత్నించినవారిపై చర్యలు



తహసీల్దార్ గౌసియా బేగమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- డీఎస్ఎస్ డిమాండ్

సిరుగుప్ప, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డీఎస్ఎస్ అంబేడ్కర్ వాద సంస్థ కన్వీనర్ బి వీరేష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో రెండు సంఘటనలు నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ గౌసియా బేగమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడికి యత్నించడం సరికాదన్నారు. తక్షణమే వారిని అరెస్టు చేయాలన్నారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పదాధికారులు వీరేష, హుస్సేనప్ప, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ మరమ్మతులు చేపట్టాలి: సీపీఐ



డ్యామ్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

కూడేరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సాగు, తాగు నీరు అందించే పీఏబీఆర్ డ్యామ్‌లో 11 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా నాయకుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను శనివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించిన వారు మాట్లాడారు. డ్యామ్‌కు ఏర్పడ్డ లీకేజీల కారణంగా నీటిని నిల్వ స్థాయి ఐదు టీఎంసీలకు పడిపోయిందన్నారు. డ్యామ్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తే 49 చెరువులకు సాగు, తాగు నీరు అందించవచ్చని, జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని, దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్ చొరవ చూపాలని అన్నారు. పీఏబీఆర్ డ్యామ్ నుంచి కుడికాలువకు ఐదు టీఎంసీల నీరు ఇస్తామని జీఓలు ఇచ్చారే తప్ప దాన్ని అమలు చేయలేదన్నారు. కుడి కాలువకు ద్వారా ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాల్లో ఉన్న చెరువులకు నీటిని మళ్లించి రైతులను ఆదుకోవాలన్నారు. వారి వెంట రాజారెడ్డి, మల్లికార్జున, కేశవరెడ్డి, పెరుగుసంగప్ప, మండల కార్యదర్శి నాగేంద్ర, రమణ, రమణప్ప, నారాయణమ్మ, మలరాయుడు ఉన్నారు.

- సబ్సిడీ పప్పుశనగ అందించాలి

ఉరవకొండ : రబీ సీజన్ ప్రారంభమైనా రైతుల కు ఇప్పటి వరకూ సబ్సిడీ పప్పుశనగను ప్రభు త్వం అందించక పోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మండిపడ్డా రు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థా యి సమావేశం అనంతరం ఆయన మాట్లాడా రు. ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదన్న కారణంతో ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ సేవలు నిలిపి వేశాయని, తక్షణమే బకాయి పడ్డ రూ.2700 కోట్లు విడుదల చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి మల్లికార్జున, సీపీఎం నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, సంగప్ప, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫోన్ కాల్‌తో ఆగిన పెళ్లి..!

- వధువుతో పరిచయం ఉందంటూ వరుడికి సమాచారం

అనంతపురంరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్వాకంతో ఓ యువతి పెళ్లి ఆగిపోయిన సంఘటన అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామం లో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు... గ్రామానికి చెంది న యువతికి రాప్తాడు మండలం గంగులకుంట గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయించారు. శని, ఆదివారాల్లో పెళ్లి జరగాల్సి ఉంది. ఇరువైపుల వారు పెళ్లి సిద్ధమయ్యారు. అయితే మన్నీల గ్రామానికి చెందిన బాలచంద్ర శుక్రవారం వరుడికి ఫోన్ చేసి 'నువ్వు పెళ్లి చేసుకోబోయే అమ్మాయితో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. మేమిద్దరం కలిసి దిగిన ఫొటోలు కూడా ఉన్నాయి. కావాలంటే పంపుతా చూడు' అంటూ వాట్సాప్‌లో ఫొటోలు పంపాడు. వరుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు పెళ్లి రద్దు చేసుకుంటున్నట్లు యువతి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. పెళ్లి ఆగిపోవడానికి బాలచంద్ర కారణమని యువతి కుటుంబసభ్యులు ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బాలచంద్ర కుటుంబసభ్యులపై దాడి చేశారు. ఇది జీర్ణించుకోలేని బాల చంద్ర కుటుంబ సభ్యులు బాలు, జయ, ఈశ్వరయ్య, శివయ్య, అంజి తదితరులు శుక్రవారం సాయంత్రం గ్రామంలో పెద్ద ఎత్తున కేకలు వేస్తూ వేటకొడవళ్లు, రాడ్లతో హల్‌చల్ చేశారు. యువతి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబసభ్యులపై దాడికి దిగారు. అయితే గ్రామస్థులంతా కలిసి వారిని అడ్డుకున్నారు. తర్వాత యువతి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్థులంతా తిరిగి ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదు చేస్తున్న మన్నీల గ్రామస్థులు

ఘనంగా ద్విముఖ గణపతి ఆలయ వార్షికోత్సవం

శిడ్లఘట్ట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయ 11వ వార్షికోత్సవం, సంకష్టహర చతుర్థి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, పంచకళశ ఆరాధన, సంకష్టచతుర్థి పూజలు కొనసాగాయి. రాత్రి విశేష గణహోమం, సంకష్టచతుర్థి కథా శ్రవణం చేశారు. మహా మంగళారతి అనంతరం పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ద్విముఖ గణపతికి విశేష అలంకరణ

ట్రాఫిక్ నియంత్రణకు మరో 105 సీసీ కెమెరాలు

- ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ కార్తీక్‌రెడ్డి

బెంగళూరు మెట్రో, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వారిపై నిఘాలో భాగంగా ప్రస్తుతం ఉన్న 500 సీసీ కెమెరాలకు అదనంగా మరో 105 సీసీ కెమెరాలు అమర్చినట్టు ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ కార్తీక్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాదిలో మరిన్ని కెమెరాలు అమర్చే ఆలోచన ఉందన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల ఫుట్టేజీలను సిబ్బంది కంట్రోల్ రూంలో పర్యవేక్షిస్తుంటారన్నారు. ఒకవేళ ఏదైనా కెమెరా పనిచేయకుంటే ఆ విషయం మానిటర్ సిస్టమ్‌లో తెలిసిపోతుందన్నారు. 24గంటలలోగా సీసీ టీవీని మరమ్మతు చేయకుంటే సదరు సంస్థకు జరిమానా విధించనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా నాన్‌పీక్ అవర్స్‌లో ఎంపిక చేసిన కొన్ని రోడ్లపై సింక్రనైజ్డ్ సిగ్నల్ వ్యవస్థ కల్పించినట్టు తెలిపారు. తద్వారా ట్రాఫిక్‌లో అనవసరంగా సమయం వృథా కావడం అరికడుతుందన్నారు.

గ్రామాలలో రోడ్ల పనులకు చర్యలు

చేళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా పులగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రీతిరెడ్డిపల్లి, నల్లసామిపల్లి, గాంధీపురం, పులగంటివారిపల్లి, బెల్లాలపలి గ్రామాలకు రోడ్డుపనులు త్వరలో చేపడతామని బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలు ఆలకించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేకలవారిపల్లిలో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఆకట్టుకుంటున్న గ్రామ్‌ఫోన్

బెంగళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫోరం సౌత్ బీఎల్ఆర్ ఫెస్ట్ మూడో ఎడిషన్‌లో భాగంగా బ్యాక్ టు ది ఫ్యూచర్ థీమ్‌లో భాగంగా 40 అడుగుల గ్రామ్‌ఫోన్ ఏర్పాటు చేశారు. ఒకప్పటి మధుర జ్ఞాపకాలుగా మిగిలిన గ్రామ్ ఫోన్‌ను 20మంది నైపుణ్యంగల కార్మికులు 15రోజులు శ్రమించి రూపొందించారు. ఫోరం మాల్ సీఈఓ మొహమ్మద్ అలి మాట్లాడుతూ 70, 80, 90 దశకాలలో గ్రామ్‌ఫోన్‌ల ద్వారా పాటలు వినేవారని, కాలక్రమంలో గ్రామ్‌ఫోన్ కనుమరుగైం దన్నారు. మాల్‌ను సందర్శించేవారికి ఇదో ఆకర్షణగా ఉంటుందన్నారు.



40 అడుగుల గ్రామ్‌ఫోన్ ఇదే...

గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో నలుగురు పశ్చిమబెంగాల్ వాసులు దుర్మరణం

బెంగళూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రామనగర పరిధిలోని బిడది భీమనహళ్ళి గ్రామంలో ఓ షెడ్‌లో గ్యాస్ సిలిండర్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వారిలో నలుగురు విక్టోరియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన మస్రుల్ షేక్, షఫీజ్ షేక్, జాహిద్ అలి, జియాబుర్ షేక్ మృతి చెందినవారిగా గుర్తించారు. ఇటీవల భవన నిర్మాణ కార్మికులు తాత్కాలికంగా ఓ షెడ్‌ను ఏర్పాటు చేసుకుని అందులో నివసించేవారు. ఈనెల 7న వంటగ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో హసన్ మల్లిక్, తబ్బుల్‌షేక్, నూర్ జమల్, మస్రుల్ షేక్, షఫీజ్ షేక్, జాహిద్ అలి, జియాబుర్ షేక్ గాయపడ్డారు. వారందరినీ విక్టోరియా ఆసుపత్రిలో చేర్పించగా నలుగురు మృతి చెందారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన వీరంతా కూలిపనులకోసం బిడది ప్రాంతానికి వచ్చారు. పనిచేస్తున్న చోటునే తాత్కాలికంగా షెడ్ ఏర్పాటు చేసుకుని అక్కడే బస చేసేవారు. రాత్రివేళ సిలిండర్ లీకైంది. తెల్లవారుజామున ఓ కార్మికుడు నిద్రలేచి బీడీ తాగేందుకు అగ్గిపెట్టె వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. నిద్రమత్తులో ఉన్నవారు కాలిన గాయాలతో బయటపడ్డారు. స్థానికులు మంటలను ఆర్పారు. ప్రస్తుతం నలుగురు మృతి చెందగా మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు రామనగర ఎస్పీ శ్రీనివాసగౌడ తెలిపారు. బిడది పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

కంప్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మెట్రి గ్రామ పంచాయితీ పరిధిలోని ఉప్పరహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన టి హుల్లేష్ అనే 12 యేళ్ల బాలుడు శనివారం పాఠశాలకు సెలవు కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో చెరువులో ఈతకు వెళ్లాడు. అయితే నీటిలో మునిగి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోలీసు శాఖకు సమాచారం అందించారు. సంఘటనపై కంప్లి పోలీసులు కేసు నమోదు చేపట్టారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవగా స్థానికులను కలచివేసింది.



హుల్లేష్(ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.91	1631.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,189	28,490
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,217	27,406
నీటి నిల్వ (టీఎంసీలు)	79.50	101.54



మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తుంగభద్ర జలాశయంలో మునిగి

ఇద్దరు యువకుల మృతి

కంప్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మరమ్మనహళ్లి సమీపంలో తుంగభద్ర జలాశయం నీటిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం ఉదయం స్నానం చేయడానికి వెళ్లిన ఇమామ్ (24), రాజభక్షి (20) మృతి చెందారు. మరమ్మనహళ్లిలో పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజబక్షి ఇమామ్ యువకులు ఇద్దరు తుంగభద్రలో స్నానం చేయడానికి వెళ్లి అదుపుతప్పి కాలు జారి నీటిలో పడడంతో ఊపిరాడక మృతి చెందారన్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకదళాలు సంఘటన స్థలానికి చేరుకుని ఇద్దరు మృతదేహాలను బయటికి తీశారు. చేతికొచ్చిన కుమారుల మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆహారకిట్‌తో పేదలకు ఎంతో మేలు

● కాంగ్రెస్ కో- ఆర్డినేటర్ వెంకటేశ్ హెగ్డే



బళ్లారి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందించనున్న ఇందిరా కిట్ పేదలకు ఎంతో ఉపయోగకరమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కో- ఆర్డినేటర్, ప్రచార కర్త వెంకటేశ్ హెగ్డే ఒక ప్రకటనలో అన్నారు. గతంలో కేవలం బియ్యం మాత్రమే రేషన్ దుకాణాల్లో ఇచ్చేవారని, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని 5 కేజీల బియ్యం, కంది బ్యాడలు, నూనె, ఉప్పు లాంటి నిత్యవసరాల అందజేస్తామన్నారు. త్వరలో ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తారన్నారు. ధరలు మండిపోతున్న వేళ ఇలాంటి సరుకులు ఎంతో ఉపయోగకరమన్నారు. పేదలకు మేలు చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఆరోగ్యానికి పొగ

● స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల్లో మితిమీరిన కాలుష్యం
● సమీప ప్రాంత ప్రజలకు శ్వాసకోస సమస్యలు
● భారీ వాహనాలతో దెబ్బతింటున్న రహదారులు



బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్మాగారాలు పుష్కలంగా ఉండి ఎందరో కార్మికుల కడుపు నింపుతున్నాయి. అయితే కొన్ని రకాల ఫ్యాక్టరీలు కాలుష్యంతో ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. బళ్ళారి, సండూరు ప్రాంతాల్లో ఎక్కువ ఇనుప ఖనిజం కొండలు ఎక్కువగా ఉన్న కారణంగా ఈ ప్రాంతంలో వాయుకాలుష్యం ఎక్కువగా ఉందని గుర్తించిన బ్రిటీషువారు అప్పటికే బళ్లారి నగరంలో టిబి ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించేవారని, అప్పట్లో నిర్మించిన టీబీ ఆసుపత్రిలో ఇప్పటికీ శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్యం అందిస్తున్నారని పలువురు వాపోతుంటారు. రెండున్నర దశాబ్దాల క్రింతం అంతంత మాత్రంగానే ఉన్న ఇనుప ఖనిజ తవ్వకాలు 2000వేల సంవత్సరం నుంచి విస్తృతంగా ముడి ఇనుప ఖనిజ తవ్వకాలు ప్రారంభం కావడంతో వాటికి అనుబంధంగా అనేక స్పాంజ్ ఐరన్ తయారీ ఫ్యాక్టరీలు వెలిశాయి. ఫ్యాక్టరీల్లో ఉపాధి అవకాశాలు లభించినా దానికి మించి రెండింతలు ఫ్యాక్టరీల నుంచి వస్తున్న కాలుష్యం చుట్టప్రక్కల ప్రాంతాలను కాలుష్య కోరల్లో కబళించేస్తోంది. దరిమిలా ఫ్యాక్టరీల చుట్టప్రక్కల ఉన్న పంటలపొలాలు, గ్రామాలు కాలష్యం కోరల్లో చిక్కుకుని విలవిలాడుతున్నాయి. కాలుష్య నియంత్రణ చేయాల్సి అధికారులు తూతూమంతంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడం ఫ్యాక్టరీలు ప్రజల పాలిట శాపంగా మారింది. బళ్ళారి చుట్టుప్రక్కల హలకుంది, బ్యాలచింద, బెళగల్లు, జానకెంటు, వేణీవీరాపు, కుడితిని, సండూరు, తోరణగల్లు ప్రాంతాల్లో పుట్టగొడుగొల్లా వెలిశాయి. ప్రస్తుం బళ్ళారి తాలూకా పరిధిలోనే 20కి పైగా స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు ఉండడంతో చుట్టుప్రక్కల గ్రామాల దయనీయ పరిస్థితి నెలకొంది.

పేరుకు మాత్రమే ఈఎస్‌పీ

సాధారణంగా స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల్లో బయటకు విడుదల పొగను వదలకుండా ఈఎస్‌పీ అనే పరికరాన్ని ఉపయోగించి ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలను ఫిల్టర్ చేసిన తరువాతనే బయటకు వదలాలి. ఈఎస్‌పీ అంటే " ఎలక్ట్రోస్టాటిక్ ప్రొపెసిపటేటర్ " ఇది వాయు కాలుష్య నియంత్రణలో ఉపయోగించే పరికరం. ఫ్యాక్టరీల నుంచి బయటకు వచ్చే పొగను ఇందులో ఫిల్టర్ చేయాలి. ఈ ప్రక్రియలో బయటికి వచ్చే పొగ నుంచి దుమ్ము, బూడిద, పొగ వంటి వ్యర్థ పదార్థాలు తొలగిస్తారు. అయితే ఈ విధానాన్ని పాటించాలంటే ఖర్చుతో కూడుకున్నది కారణంగా ఈ సిస్టమ్‌ను ఫ్యాక్టరీ వాళ్ళు చూడడానికి మాత్రమే ఈఎస్‌పీ ఏర్పాటు చేసుకుంటారే మినహాల ఏ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వారు కూడా ఈ విధానం ఉపయోగించరనే విషయం అధికారులకు తెలిసిందే. అయితే సంబంధిత ఫ్యాక్టరీలపై చర్యలు చేపట్టడం లేదు. నిత్యం కాలుష్యం నుంచి కాపాడాలని స్థానిక రైతులు, ప్రజలు నిత్యం పోరాడుతూ జిల్లా పాలనా మండలి దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదని వాపోతున్నారు. శుక్రవారం నగరంలో వాయుకాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటై 50ఏళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అరశతాబ్దం ఉత్సవాలు జరుపుకోవడం విశేషం. తాలూకాలో పరిస్థితి ఇలాగా కొనసాగితే...శ్వాసకోశ వ్యాధుల బాధితులు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు ఎంత ముఖ్యమో... ప్రజల ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని, ఈ దోరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వేణీవీరాపురం సమీపంలో దుమ్ము రేపుతున్న ఐరన్ లారీలు



నల్లగా మారిన రోడ్డు

టెలిస్కోప్ శిక్షణ శిబిరంలో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

బళ్లారి సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాస్త్రీయ పరిశోధన మండలి దొడ్డబళ్లాపూర్‌లోని అనిబీసెంట్ పార్క్‌లో నిర్వహించిన మొదటి రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరానికి జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొని విజయం సాధించారని సైంటిఫిక్ కౌన్సిల్‌కు చెందిన ఆర్‌హెచ్‌ఎం చన్నబసయ్యస్వామి తెలిపారు. శనివారం నగరంలోని పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న ఏడుగురు విద్యార్థుల్లో సిరుగుప్ప తాలూకాలోని వివేకానంద పాఠశాలకు చెందిన శివకుమార్ మెదటి స్థానం, ఈరద సూగమ్మ పాఠశాలకు చెందిన విద్యాసాగర్, ఎస్కె. మోదీ నేషనల్ స్కూల్‌కు చెందిన జాన్విసంజీవశెట్టి, జ్ఞానామృత పాఠశాలకు చెందిన మహ్మద్ సోహైల్, బళ్లారిలోని నందా రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన గవిసిద్దప్ప, దేశ్నూర్ పాఠశాలకు చెందిన దేవరాజు 'నేను విజ్ఞాని 2025 రాష్ట్రస్థాయి టెలిస్కోప్ శిక్షణలో పాల్గొని ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థాన సంపాదించారన్నారు. విద్యార్థులను ఆర్ హెచ్ చన్నబసయ్యస్వామి సంబంధిత పాఠశాలల పిల్లలు తల్లిదండ్రులు ,విద్యా సంస్థల నాయకులు ,పాఠశాల ప్రాధానోపాధ్యాయులు, బోధనా సిబ్బందిని అభినందించారు. విలేకరుల సమావేశంలో టెలిస్కోప్ తయారీ శిక్షణ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు, మార్గదర్శక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటి స్థానంలో నిలిచిన శివకుమార్ టెలిస్కోప్ తయారీపై తాను పొందిన శిక్షణ గురించి వివరించారు.



విలేకరుల సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష

● గ్రాంట్ల చెల్లింపులో జాప్యంతో కుంటుపడుతున్న అభివృద్ధి
● యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ



ర్యాలీలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలు

బళ్లారి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాకుండా అడ్డుకుంటోందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ ఆరోపించారు. శనివారం బళ్లారి జిల్లా సండూరులో కాంగ్రెస్ యువజన పార్టీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రంలపై చిన్నచూపు చూస్తోందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నీ పక్కాగా అమలు చేస్తోందన్నారు. బీజేపీ ఓట్ల చౌర్యంతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి రావల్సిన నిధులు సక్రమంగా అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుండి యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం ముందు నగరంలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హ్యారీస్

రక్తదానానికి మహిళలు ముందుకు రావాలి

● జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్

బళ్లారి సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రక్తదానానికి మహిళలు ముందుకు రావాలని జడ్పీ సీఈఓ మహ్మద్ హ్యారీస్ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని శనివారం నగరంలోని అల్లంసుమంగళమ్మ మహిళా కళాశాలలో(ఏఎస్‌ఎం) ఘనంగా నిర్వహించారు. శ్రీమతి అల్లం సుమంగళమ్మ మహిళా కళాశాల, బిమ్స్‌జిల్లాపంచాయతీ, బళ్లారి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్ మొక్కకు నీరు పోసీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తనజీవితంలో మహిళలు రక్తదానం చేయడం ఇదే తొలిసారి అని వారిని అభినందించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ మహిపాల్, రెడ్‌క్రాస్ సంస్థ షకీబ్ రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ ఇంద్రాణి, బిందురాణి, కత్యాయిని , కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్, రెడ్‌క్రాస్ సంస్థ దేవణ్ణ, వీరేశ్, సైయ్యద్ తస్వీర్, రిజ్వాన్ షైనుద్దీన్, రెడ్‌క్రాస్ సభ్యులు ఉమా, మహేశ్వరీ, వాసు, సమీర్‌సేట్, శివసాగర్, తాహేర్‌సేట్, వలిబాషా పాల్గొన్నారు.

రోడ్డు పనులతో వాహనాల మళ్లింపు

బళ్లారి సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు పనుల కారణంగా పలు చోట్ల దారిమళ్లింపు చేపట్టారు. గడిగిచెన్నప్ప (రాయల్)సర్కిల్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జివరకు రోడ్డు అభివృద్ధి పనులు జరగుతున్నాయి. నగర రవాణా బస్టాండ్(పాత బస్టాండ్) ముందు వాహనాల కార్యకలాపాలు నిలిపివేశారు. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి డివిజనల్ కంట్రోలర్ మాట్లాడుతూ ప్రజలు ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలని తెలిపారు. సిరుగుప్ప వైపు వెళ్లే బస్సులు సెంట్రల్ బస్టాండ్ నుండి హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ రైల్వే బ్రిడ్జి ఫ్లైఓవర్, సెవెన్ చిల్డ్రన్ టెంపుల్(ఏళుమక్కల తాయి) ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలన్నారు. తాలూర్ వైపు వెళ్లే బస్సులు నగరంలోని తాలూరు రోడ్డు మీదుగా, మోకా వైపు వెళ్లే బస్సులు సెంట్రల్ బస్‌స్టాండ్ నుంచి గడిగ చెన్నప్ప సర్కిల్(రాయల్), మున్సిపల్ కాలేజీ ఇందిరా సర్కిల్, కూల్ కార్నర్, ఎస్‌ఎన్‌పేట ఫ్లైఓవర్ మీదుగా నడపాలపాలన్నారు. వాహనదారులు సహకరించాలన్నారు.



బస్టాండ్‌వైపు వెళ్తున్న వాహనాలు

కంప్లి - కర్నూలు బస్సు సర్వీసు ప్రారంభం



కంప్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : కంప్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం కంప్లిలో 7.30కు బయలుదేరి కురుగోడు మీదుగా బళ్లారి చేరుకుని అక్కడి నుంచి మోకా ఆలూరు ఆస్పరి కోడుమూరు మీదుగా కర్నూలు చేరుకుంటుందన్నారు. తిరిగి వచ్చే సమయంలో కర్నూలు నుండి బళ్లారి చేరుకుని తిరిగి చివరికి కురుగోడు లాస్ట్‌స్టాప్ అవుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సమాజ సేవకుడు పెనుకులపాటి హనుమంతరాయుడు మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు చెందిన ఎంతో మంది కంప్లిలో జీవిస్తున్నారని, నూతన బస్సు ఎంతో ఉపయోగకరమన్నారు. కేఎస్‌ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రభుత్వం బస్సు రవాణా అధికారులతో చర్చించే కంప్లిలో కర్నూలు జిల్లా ప్రజల దృష్టిలో వుంచుకుని ఈ రూట్‌ను ఏర్పాటు చేశాము. ప్రస్తుతానికి కంప్లి నుండి కర్నూలుకు తిరిగి కర్నూలు నుండి కురుగోడు అనుమతులు తీసుకున్నాము. మరికొన్ని రోజుల్లో కర్నూలు నుండి వచ్చే సమయంలో కంప్లి చివరిస్టాప్‌గా చేపడతామని తెలిపారు.

జీతాలు చెల్లించాలని హెల్త్‌వర్కర్ల ఆందోళన

బళ్లారి సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ హెల్త్‌అండ్ వెల్నెస్ సెంటర్లు, సబ్- సెంటర్లలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులకు జీతాలు చెల్లించాలని, నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హెల్త్ సెంటర్ ముందు ఆందోళనకు దిగిన వారు మాట్లాడుతూ జీతాలు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నామని, జాతీయ ఆరోగ్యమిషన్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.501 ఆరోగ్య వెల్నెస్ కేంద్రాలు ఉన్నాయని, బళ్లారి జిల్లాలో మొత్తం 78మంది సండూర్ తాలూకాలో 25మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తక్కువ వేతనాలతో ఐదు సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నామన్నారు. ప్రసూతి, ప్రసవానంతర సేవలు, శిశు, బాల్య , కౌమార ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్యం, అంటు వ్యాధుల నిర్వహణ, అత్యవసర వైద్య సేవలు అందిస్తూ ప్రజలు అందుబాటులో ఉన్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రింబవళ్ళు ఆరోగ్య సేవలు అందించే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత నాలుగు నెలలుగా జీతాలు లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బకాయి జీతాలను విడుదల చేయాలని, అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని వారు కోరారు. జీతాల సమస్య ఆరోగ్య శాఖ దృష్టిలో ఉంది. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేయగానే జీతాలు చెల్లిస్తామని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు అన్నారు.

హోసూరు జోన్

ఇమ్మిడినాయకనపల్లిలో గ్రామసభ

● వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామస్థులతో మాట్లాడిన సీఎం స్టాలిన్





గ్రామ సభలో కలెక్టర్ దినేశ్ కుమార్.. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం

హోసూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్ ఇమ్మిడినాయకనపల్లి గ్రామసభలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చెన్నైనుంచి శనివారం వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లాలోని 333 పంచాయతీలలో గ్రామసభలు జరిగాయి. గ్రామస్తుల సమస్యలు ఆలకించారు. 7 రకాల ఫిర్యాదులను ఎంపిక చేశారు. గ్రామసభకు 3 పనులను అప్పగించారు. వీటిని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, రోడ్లు వీధులకు అవమానకరమైన కులం పేర్లతో పేర్లు మార్చడం చేయరాదని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అన్ని గ్రామాల అణ్ణ పునరుజ్జీవన పథకం, స్వచ్ఛ భారత్, అని అన్ని రకాల నైపుణ్యాల శిక్షణ గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ పథకం, తమిళనాడు మహిళా అభివృద్ధి సంస్థ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలు, స్వయం ఉపాధి వాటికి ప్రాధాన్యత ఇచ్చారు. అలాగే వర్షాకాలం కాబట్టి ప్రజలు తమ ఇళ్ల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ప్రబలకుండా నీటి ట్యాంకులను తరచుగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా చెత్తను బహిరంగ ప్రదేశంలో వేయడానికి బదులుగా బయోడీగ్రేడబుల్ చెత్తగా మార్చే చర్యలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇళ్లల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. మీ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ మహదేవన్, జాయింట్ డైరెక్టర్ కాళీముత్తు, తాలూకా అధికారి రమేశ్, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు కళా, కార్తీ, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజ్, ఉద్యానవన శాఖ, వైద్య శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డులో మేయర్ పర్యటన

హోసూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు 14వ వార్డులో మేయర్ సత్య పర్యటించారు. మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యాల గురించి స్థానికుల సమస్యలను ఆలకించారు. సున్నాంబు జీబి, దుర్గానగర్, బృందావన్ నగర్ మెయిన్ రోడ్డు ప్రాంతాలతో సహ మేయర్ సత్య వివిధ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఏరియా కార్యదర్శి వెంకటేశ్, కౌన్సిలర్ శ్రీనివాసులు, స్థానికులు శేఖర్, మోహన్ వార్డ్ అడ్మినిస్ట్రేటర్ శరవణన్, శక్తి నగర వ్యాపార సంఘం వేలు, ప్రజలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ సత్య

రబీకి నీరివ్వాలని రైతుసంఘం వినతి



ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర జలాశయం నుంచి రబీ పంటకు నీరు ఇవ్వాలని తుంగభద్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధరూరు పురుషోత్తమ్ గౌడ కోరారు. శనివారం ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బెంగళూరులోని విధానసభలో జూన్ 27న జరిగిన తుంగభద్ర జలాశయ నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో వర్షాకాలపు పంటకు నీరందించాలని నిర్ణయం తీసుకున్నారు. వర్షాకాలపు అనంతరం రబీపంటకు పై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన నీటిపారుదల నిపుణులతో సహా తుంగభద్ర జలాశయ నీటి పారుదల నిపుణులతో సహా తుంగభద్ర జలాశయ నీటిపారుదల సలహా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గేట్ల ఏర్పాటు చేస్తూ వేసవిపంటకు నీరందించడం గురించి నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారన్నారు. ఆ నిర్ణయం ప్రకారమే జనవరి నెలాఖరు నాటికి జలాశయంలోని కుడి, ఎడమ ఉన్న అన్ని కాలువలకు నీరందించి 40 టీఎంసీల నీటిని జలాశయంలో నిల్వ చేస్తూ గేట్ల మరమ్మత్తులు పనులు చేపడుతూ 40 టీఎంసీలతో నీటితో రబీపంటకు నీరు ఇవ్వవచ్చునన్నారు. 33 కొత్త గేట్ల ఏర్పాటుకు సమయం లభిస్తుంది. వేసవి పంటలకు నీరు అందుబాటులో వుంటుంది. కుడి ఎడమ ఉన్న కాలువల ద్వారా నాలుగు జిల్లాల రైతులకు తాగునీరు అందించవచ్చన్నారు. కావున దీనిపై సీఎం, డీసీఎం నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఇచ్చిన ముఖ్యమంత్రితో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంపాపతి, భీమనగౌడ, శంకర్‌గౌడ, శాంతప్ప, నాగేంద్ర, మల్లప్ప, భీమనాయక్, మల్లికార్జున, దాసప్ప, లింగారెడ్డి, శ్రీకాంత్‌రావు, వీరన్నగౌడ, రాజశేఖర్, ఖాజావలీ, రాజాసాబ్ పాల్గొన్నారు.

సమాజ సేవకు ముందుకు రావాలి

ప్రతి యువకుడు సమాజసేవకు ముందుకు రావాలని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. ఎమ్మిగనూరు సమాజసేవకుడు కనకా సునుగార్ పుట్టినరోజు సందర్భంగా మంగళముఖిలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది యువతీయువకుల పుట్టినరోజు వేడుకలను పేరుతో ఎన్నో డబ్బులు వృథాగా చేపడతారు కానీ ఎమ్మిగనూరుకు చెందిన కనక సునగార్ మాత్రం అలా కాకుండా మంగళముఖిని గుర్తించి చీరలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు.

సబ్సిడీ బియ్యం లారీ పట్టివేత

సిరుగుప్ప, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని ఆహార పౌరసరఫరా అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. శనివారం సిరుగుప్ప తాలుకా పరిధిలో టెక్కలకోట పట్టణంలో రూ. 4.75 లక్షల సబ్సిడీ బియ్యాన్ని రవాణా చేస్తుండగా స్థానికుల సమాచారం మేరకు ఆహార పౌర సరఫరాల ఇన్స్‌పెక్టర్ మహారుద్రగౌడ, విజయ్‌కుమార్ దాడులు చేశారు. ఈ మేరకు టెక్కలకోట ఎస్ఐ సద్దాం హుస్సేన్ కేసు నమోదు చేశారు.



లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

ధర్మస్థల సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం : ఎమ్మెల్యే

కంప్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్థలు ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం పరచుకోవాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. శనివారం కంప్లి పట్టణంలో వీరశైవ సముదాయ భవనంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి పూజలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళలు గుంపుల ద్వారా ఎన్నో సదుపాయాలు పొందుతున్నారు. ప్రభుత్వం ఇవ్వలేని సదుపాయాలు సంస్థ అందిస్తోందన్నారు. తాలుకా పరిధిలోని రెండు వేలకు పైగా గ్రూపులు ఉన్నాయన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకోవాలంటే ఎన్నో షరతులు, ఆధారాలు తీసుకుంటారు కానీ ధర్మస్థలం గ్రామీణ అభివృద్ధి సంస్థ మాత్రం ఎలాంటి ఆధారాలు లేకుండా రుణం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ శివాచార్య స్వాములు వెంకటేష్ బర్మక్క, హేమయ్యస్వామి, దానప్ప, చెన్నయ్యస్వామి, జగదీష్ రాయర్కర్, రామాంజినేయులు, ఉమామహేశ్వరి, రాఘవేంద్ర, అయోధ్య వెంకటేష్, విద్య శంకర్, అరివి బసవన్న గౌడ, మంజుళ, సీఆర్ హనుమంతు, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.